క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధిత వ్యక్తికి రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కుక్కునూరు: గొమ్ముగూడెం గ్రామానికి చెందిన మాటూరి రాంబాబుకు శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.2 లక్షల చెక్కును వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. కొన్నేళ్లుగా కాళ్ల వాపులు, నడుము నొప్పి, కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న రాంబాబు తన ఆర్థిక, ఆరోగ్య పరిస్థితిని ఇటీవల వరద బాధితులను పరామర్శించేందుకు గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించాడు. అతని పరిస్థితిని చూసిన సీఎం వైఎస్ జగన్ ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. హామీ ఇచ్చిన నెలరోజుల్లోనే బాధితుడికి రూ.2 లక్షల చెక్కును ఆర్థికసాయంగా అందించారు.

డీఈవో ఆకస్మిక సందర్శన

కొయ్యలగూడెం: బయ్యనగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ని డీఈవో శ్యాంసుందర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల నోట్ బుక్స్, విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఐఎఫ్‌పీలతో బోధన ఎలా ఉంటున్నది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకి దిశా నిర్దేశం చేశారు. ప్రధానోపాధ్యాయులు కె.రవి కుమార్‌తో పదవ తరగతి పరీక్షల తర్ఫీదు గురించి తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తురాలి పేరున శనివారం రూ. 3.65 లక్షలను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ముక్కు ఫౌండేషన్ అధినేత ముక్కు జయలక్ష్మి పేరున ట్రస్టు వారు ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో సూపరింటెండెంట్ రాజుకు అందించారు. ఈ సందర్భంగా దాతకు రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు.

'గురుకుల' విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

చింతలపూడి: రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ అండర్ 14 పోటీల్లో తుమ్మలపల్లి నిఖిల్, డిస్కస్ త్రో అండర్ 17 పోటీల్లో తాళ్ళూరి భార్గవ్, జావెలిన్ అండర్ 17 పోటీల్లో తగరం మహేష్ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎల్ కిషోర్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీఈటీలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

డిస్క్‌త్రో పోటీలకు గిరిజన విద్యార్థి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విష్ణు

బుట్టాయగూడెం: తాడేపల్లిగూడెంలో జరిగిన ఎస్‌జీఎఫ్ స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి సెలక్షన్స్‌లో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ధర్మల విష్ణు ఎంపికైనట్లు పీఆర్‌గూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కె.శిరమయ్య తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ పోటీల్లో విష్ణు డిస్క్‌త్రోలో ప్రథమ స్థానం, అలాగే హై జంప్‌లో కూడా ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయిలో పల్నాడులో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. కాగా విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పీఈటీ దుర్గయ్యను ఆయన అభినందించారు.

పారదర్శకంగా పశువుల క్రయవిక్రయాలు



మాట్లాడుతున్న జగ్గవరపు జానకిరెడ్డి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి పశువుల అక్రమ రవాణా జరగడం లేదని చింతలపూడి ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి స్పష్టం చేశారు. ఓ పత్రికలో ఇటీవల పశువుల అక్రమ రవాణా జరుగుతుందని అసత్య కథనాలు ప్రచురితమయ్యాయని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శనివారం జానకిరెడ్డి, పశు వైద్యాధికారులు, రవాణా శాఖాధికారులతో కలిసి మార్కెట్ యార్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డులో 30ఏళ్లుగా పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. మార్కెట్‌యార్డులో జరిగే క్రయ విక్రయాలు అన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. అధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అసత్య కథనాలతో తప్పుదోవ పట్టించొద్దని హితవు పలికారు. కార్యదర్శి షేక్ బాషా, ఆర్డీవో మదని, పశువైద్యశాఖ ఏడీఏ శేఖర్ దొర పాల్గొన్నారు.



కామవరపుకోట : పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



పోలవరం : వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి



టి.నరసాపురం : వీరభద్రవరంలో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జెడ్పీటీసీ



జంగారెడ్డిగూడెం : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



వేలేరుపాడు : ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఝాన్సీరాణి

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

బుట్టాయగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం అని, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే బాలరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సురక్షలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ఎమ్మెల్యే బాలరాజు కూడా ఇక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, ఎంపీటీసీ కొవ్వాసి వరలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే బాజీ, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా..

కొయ్యలగూడెం: ఓ వైపు అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తూనే మరోవైపు ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బయ్యనగూడెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స తీసుకుంటున్న గవరవరం గ్రామానికి చెందిన తొప్పెట్ల శ్రీనివాస్ అనే యువకునికి మెరుగైన ఆరోగ్య చికిత్స నిమిత్తం లక్ష యాభై వేల రూపాయలు, సీతంపేట గ్రామానికి చెందిన మిట్టే సోమరాజుకు కృత్రిమ అవయవ నిమిత్తం రూ.2 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి గ్రాంట్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత, తదితరులు పాల్గొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేద్దాం అని మండల స్పెషల్ ఆఫీసర్, డీఈవో పి.శ్యాంసుందర్ పేర్కొన్నారు. బయ్యనగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో ఆయన ప్రసంగించారు.



కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో రూ.లక్షన్నర చెక్కును లబ్ధిదారునికి అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



జంగారెడ్డిగూడెం రూరల్ : వేగవరంలో సురక్ష కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

వేగవరంలో ఆరోగ్య సురక్ష

జంగారెడ్డిగూడెం రూరల్: వేగవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కొడమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు, ఎంపీటీసీ కుక్కల సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

కామవరపుకోట: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. శనివారం కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ కర్రి పోతు అనూష, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, వైస్ ఎంపీపీ గిరిజ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

పోలవరం రూరల్: పోలవరం -1 సచివాలయం వద్ద శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ప్రారంభించారు. 250 మందికి పైగా వైద్య సేవలు పొందారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ సర్పంచ్ పొడుం పుష్ప, వైస్ ఎంపీపీ యామల శ్రీదేవి పాల్గొన్నారు.

వీరభద్రపురంలో ఆరోగ్య సురక్ష

టి.నరసాపురం: ప్రతిక్షణం ప్రజల కోసం పరితపించే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టి.నరసాపురం జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు అన్నారు. వీరభద్రవరంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, ఉమ్మడి గంగరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో సర్వే

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. పట్టణంలోని ఆయా సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఇతర వైద్యారోగ్య శాఖసిబ్బంది సర్వేలో పాల్గొని ఆయా కుటుంబాల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. ఇంటి వద్దే పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

వేలేరులో ఆరోగ్య సురక్ష క్యాంప్

కుక్కునూరు: శ్రీధరవేలేరు పంచాయతీ పరిధిలోని వేలేరు గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం నుంచి పిల్లల వైద్యనిపుణులు, కంటి వైద్య నిపుణులు, అమరవరం, కుక్కునూరు పీహెచ్‌సీల వైద్యులు పాల్గొని 368 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్య సురక్ష

వేలేరుపాడు: ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి తెలిపారు. శనివారం రుద్రమ్మకోటలో సర్పంచ్ స్వర్ణలత అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ జి.ఎలీజా, ఎంపీడీవో మూర్తి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ దేవి, మండల వైఎస్సార్ సీపీ నాయకులు కేసగాని శ్రీనివాసగౌడ్, గుద్దేటి భాస్కర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పి.కన్నాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పి.కన్నాపురం ఎంపీయూపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆ తరువాత వైద్యులు రోగులకు తమ సేవలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. పేదకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్షను చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లే వెంకటేష్, మండల సచివాలయాల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, పెద్దిన దిలీప్, కొడుదుల ప్రసాద్, అల్లాడ హరేరామకృష్ణ, గుర్రాల లక్ష్మణ్, కొండాబత్తుల సుభద్ర, దాసరి రాంబాబు తదితరులున్నారు.



శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

చింతలపూడి: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. చింతలపూడి మండలం, రేచర్ల గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను పరిశీలించారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, జెడ్పీ సీఈఓ రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, సర్పంచ్ కె శివరామకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ తుల్లాబత్తుల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గంధం చంటి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

లింగపాలెం: కొత్తపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, సర్పంచ్ గుర్రాల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొఠారి మోహన్, సర్పంచ్‌లు పి.రమేష్, డి రవీంద్ర, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చింతలపూడి : వృద్ధునికి సురక్ష వైద్య నివేదికను అందచేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

గిరిజన రైతుల వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక కృషి

ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి డాక్టర్ జానకిరామ్

బుట్టాయగూడెం: గిరిజన సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయాభివృద్ధికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ కళాశాల ద్వారా ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని ఉద్యాన యూనివర్శిటీ ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ అన్నారు. మండలంలోని దుద్దుకూరులో శనివారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ కళాశాల ద్వారా చేపట్టిన ఐకార్, గిరిజన ఉపప్రణాళిక ద్వారా గిరిజన రైతులకు మొక్కలు, వివిధ రకాల పనిముట్లను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిమామిడి తోటల సాగు పునరుద్ధరణకు అనువైన రకాల గురించి వివరించారు. జీడిమామిడి సాగుకు ఉపయోగించే పనిముట్లు, సికేచర్లు, రంపం, లాపర్లు, ఎరువును పిచికారీ చేసే స్ప్రేలను ఎమ్మెల్యే బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ పెద్దబాబు, డాక్టర్ చాందినీ రాజ్, డాక్టర్ రవి కిరణ్, శ్రీనివాస్, ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎం.కల్పన, డాక్టర్ మాధుర్, డాక్టర్ డీవీ స్వామి, పీజీ, సర్పంచ్ తెల్లం రాముడు, సరియం చల్లయ్య పాల్గొన్నారు.



గిరిజన రైతులకు జీడిమామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జానకిరామ్

అనారోగ్యంతో వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బిరుదుగడ్డ శ్రీను (40) అతని భార్య రామలక్ష్మితో విడిపోయి 17 ఏళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో ఈ నెల 29వ తేదీ రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా భార్య రామలక్ష్మి అతని మృతదేహాన్ని గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మత్స్యకార కుటుంబాలకు భరోసా

చింతలపూడి: మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేప పిల్లల పంపిణీని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. స్థానిక పెద్ద చెరువులో శనివారం ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నరసయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా చింతలపూడి, లింగపాలెం మండలాల్లో 7.60 లక్షల చేప పిల్లలను చెరువుల్లో వదిలినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

లింగపాలెం : ఇటీవల కొద్ది రోజుల క్రితం పిడుగుపాటు బారిన పడి మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. శనివారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే ఎలీజా, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. అలాగే ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన సొంగా జ్యోత్స్నను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలకు త్వరితగతిన నష్టపరిహారం అందించాలని ఫోన్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను ఎమ్మెల్యే ఎలీజా కోరారు.

మత్స్యకారుల జీవనోపాధికి చేయూత

లింగపాలెం: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, భోగోలు మత్స్య సహకార సంఘాల పరిధిలో ఉన్న మల్లసముద్రం, పెద్ద చెరువులలో శనివారం జిల్లా ఇన్‌చార్జి మత్స్యశాఖ అధికారి, నూజివీడు సబ్‌కలెక్టర్ జీవీవీ సత్యన్నారాయణ చేపపిల్లలను విడుదల చేశారు. ఈ రెండు చెరువులలో ఉచితంగా 3 లక్షల చేప పిల్లను విడుదల చేసినట్లు సత్యన్నారాయణ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ బాదంపూడి ఏడీ బి నర్సయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తూరి రమేష్, గ్రామ మత్స్య సహాయకుడు బి.మహేష్, మత్స్య సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చింతలపూడి పెద్ద చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా చిటికెల అచ్యుతరామయ్య (అచ్చిరాజు) నియమితులయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, పీపీఎస్ చంద్రరావు, కౌన్సిలర్‌లు అచ్చిరాజును దుశ్శాలువా, పూలబొకేలతో సత్కరించి, అభినందించారు.



వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన అచ్చిరాజును అభినందిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడిగా వామిశెట్టి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం మండలాధ్యక్షుడిగా వామిశెట్టి హరిబాబు రెండవసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను అభినందించారు. తనపై నమ్మకం ఉంచి రెండవ సారి మండలాధ్యక్షులుగా నియమించడం పట్ల వామిశెట్టి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ నాయకులకు హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో మరోసారి విజయం సాధించే దిశగా కృషిచేస్తానని తెలిపారు.



వామిశెట్టి హరిబాబు

చింతలపూడి నుంచి..

చింతలపూడి: చింతలపూడి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలిగా జగ్గవరపు జానకిరెడ్డి, చింతలపూడి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా కొప్పుల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న జానకిరెడ్డి, కొప్పుల నాగులను నియమించడం పట్ల పార్టీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, సచివాలయాల కన్వీనర్లు టి శ్రీనివాసరావు, ఎన్.దుర్గారావు హర్షం వ్యక్తం చేశారు.



జగ్గవరపు జానకిరెడ్డి,



కొప్పుల నాగేశ్వరరావు,

గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కోరుతూ కౌన్సిల్ తీర్మానం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులను కోరుతూ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. 2019 ఆగస్టు 2న నగరపంచాయతీ నుంచి గ్రేడ్-2 మున్సిపాలిటీగా వర్గోన్నతి పొందింది. అయితే ప్రస్తుత జనాభా 70వేల వరకు ఉండొచ్చని, మున్సిపల్ ఆదాయం పన్నులు, పన్నేతర ఆదాయం ఏటా 7.50కోట్ల రూపాయలు లభిస్తోందని సమావేశం పేర్కొంది. ఈ నేపథ్యంలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని సమావేశం కోరింది. శనివారం చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందినట్లు హెచ్‌సీ జె.భీమశంకరం తెలిపారు. వివరాల ప్రకారం తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన ఉస్సే హరీష్ (30) విద్యుత్ లైటింగ్ , డెకరేషన్ పనులు చేస్తుంటాడు. పేరంపేటకు చెందిన కలపాల వెంకట్రావు వద్ద పనిచేస్తున్నాడు. స్థానిక విద్యావికాస్ పాఠశాల సమీపంలో గణేష్ మండపానికి వేసిన విద్యుత్ దీపాల డెకరేషన్ తొలగిస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే హరీష్ మృతి చెందాడు. హరీష్ భార్య ఉస్సే రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోర్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం

చింతలపూడి: సకాలంలో వైద్య సేవలు పొందడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం ఏరియా ఆస్పత్రి వైద్యులు డా మహేష్, కళ్యాణ్ శ్రీనివాస్ న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, సీనియర్ సిటిజన్‌లకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సమాజంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన సీనియర్ సిటిజన్స్‌ను జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు కోర్టు ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. సీనియర్ సిటిజన్స్ ఎండీ అక్బర్ అలి, పర్వతనేని రమేష్‌బాబు, మండపాటి కృష్ణారెడ్డి, మండపాటి సత్యవతిలకు శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అధ్యక్షులు చిల్లపల్లి మోహన్‌రావు, కార్యదర్శి సీహెచ్ అబ్బయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గద్దమడుగుల రాజేష్‌నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

జంగారెడ్డిగూడెం: వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ సానుభూతితో వ్యవహరించి వారిని ఆదరించాలని జంగారెడ్డిగూడెం మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ అన్నారు. అక్టోబర్ 1వ తేదీ అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. చాలామంది ఆధార్ కార్డు లేకపోవడం వలన వృద్ధాప్య పింఛన్లుగాని, ప్రభుత్వం నుంచి అందే సహాయాలు అందడం లేదని జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే వారందరికీ ఆధార్ కార్డులు ఏర్పాటు చేసి పింఛన్లు అందేలా చూడాలని వలంటీర్‌ను జడ్జి ఆదేశించారు. అనంతరం వృద్ధులకు మండల న్యాయ సేవాధికార సంస్థ తరఫున పండ్లు పంపిణీ చేశారు.